రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 26: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ కోరారు బుధవారం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారం లోనికి రావడానికి మెనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం.. రేషన్ డీలర్లకు నెలకు రూ.5వేల వేతనంతో పాటు క్వింటాలుకు రూ.300ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరడంతో ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రితోపాటు స్పీకర్ ప్రసాద్ కుమార్ చెప్పినట్లు లక్ష్మీనారాయణ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భానుచందర్, టీకుల శశిధర్‌రెడ్డి, కొత్త భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,విజయ సూర్య,బస్వ సందీప్, వినయ్, సురేశ్, షాకీర్ హైదర్ పటేల్లు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి ఘనసత్కారం



ఆయుర్వేద వైద్య నిపుణులు పొదిలి రాజుకు అవార్డును అందజేస్తున్న సినీనటుడు పృథ్వీరాజ్ తదితరులు

సైదాబాద్, మార్చి 26 : సమాజ సేవలో విశేష కృషి చేసిన గొప్ప వ్యక్తులకు గౌరవ పురస్కారాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డ్స్ 2025ను సైదాబాద్‌కు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ పొదిలి రాజుకు ప్రముఖ సినీ నటులు పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ పొదిలి రాజు మాట్లాడుతూ.. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డ్స్–2025 పురస్కారం అందజేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. తనపై మరింత బాధ్యత పెరిగిందని, మరిన్ని సామాజిక వైద్య సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి కృషి చేస్తానన్నారు.

మహిళ పై అసభ్య ప్రవర్తన.. వ్యక్తికి రెండు రోజుల శిక్ష

బడంగ్‌పేట్, మార్చి 26: ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి రెండురోజులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోర్టు ఆదేశించినట్లు సీఐ నాగరాజు తెలిపారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌కు చెందిన రమేశ్(36)అనే వ్యక్తి, గుర్రంగూడాకు చెందిన మూడవత్ సంధ్యను అసభ్యంగా తిట్టాడని పేర్కొన్నారు. దీంతో బాధితురాలు మూడవత్ సంధ్య మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. మీర్‌పేట్ పోలీసులు విచారణ జరిపి రమేశ్ కోర్టులో హాజరుపరిచారు. ఎల్బీనగర్ రెండవ ఎంఎం కోర్టు ముందు హాజరు పరచగా మెజిస్ట్రేట్ విచారణ జరిపి రమేశ్‌కు రెండు రోజులు పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛభారత్ చేయాలని, జరిమానా విదించాలని శిక్ష ఖరారు చేయడం జరిగిందన్నారు.

సక్కుబాయి చిత్రపటానికి నివాళి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎన్జీ తండా గ్రామ కార్యదర్శి సక్కుబాయి మృతికి ఉద్యోగులు సంతాపం ప్రకటించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీడీవో శైలజారెడ్డి, రవీందర్ రెడ్డి, అధికారులు రాజు, అశోక్, చందు, జావేద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

– బడంగ్‌పేట్, మార్చి 26

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రతి వేసవి కాలంలో బైగళ్ల రవీందర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. చంపాపేట చౌరస్తా పక్కన టీడీపీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్ వారి తల్లిదండ్రులు స్వర్గీయ బైగళ్ల బాబయ్య పొన్నమ్మల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, మీర్ పేట మాజీ బైగళ్ల బాలమణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు బైగళ్ల రవీందర్ సోదరులు అశోక్, జగదీశ్వర్, మాతంగి నర్సింహా, మాతంగి యాదగిరి, యాచారం ఈశ్వర్, పాశం శ్రీశైలం, నేతాజీ కాలనీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– చంపాపేట, మార్చి 26

జాతీయస్థాయి డెఫ్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన బూర్చు గోపి

ఆర్కేపురం, మార్చి 26:జాతీయస్థాయి డెఫ్ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో కొత్తపేటకు చెందిన బూర్చు సురేశ్, అనూష దంపతుల కుమారుడు మాస్టర్ బూర్చు గోపి బ్యాడ్మింటన్‌లో జూనియర్ బాయ్స్ సింగిల్స్ అండర్–18లో బ్రాంజ్ మెడల్, జూనియర్ మిక్స్ డబుల్ అండర్–18లో సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 2025 సంవత్సర ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ జాతీయ డెఫ్ సీనియర్, జూనియర్, సబ్–జూనియర్ స్పోర్ట్ ఛాంపియన్‌షిప్‌లో తాను మెడల్స్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తానని, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తానని తెలిపారు. నా విజయంలో కీలక పాత్ర పోషించిన నాగోల్‌కు చెందిన బీబీబీఏ ఆర్ త్రి బ్యాడ్మింటన్ కోచ్‌లకు, కుటుంబసభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మెడల్స్‌తో గోపీ

డబుల్ ఇండ్లను అర్హులైన పేదలకివ్వాలి

సీపీఎం నాయకుల ధర్నా

ఎల్బీనగర్, మార్చి 26: ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని ఎల్బీనగర్ సర్కిల్ ఆఫీసు ముందు సీపీఎం అధ్వర్యంలో ధర్నా చేశారు. అర్హులైన పేదలందరికీ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని, జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ హాజరైనా ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేండ్లు గడుస్తున్నా ఇండ్ల సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇల్లులేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని సర్వే చేయించి డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు చేసుకోమని చెప్పిందని, వారికి నేటికీ డబుల్ బెడ్రూంలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వనస్థలిపురం నందవనం ప్రాంతంలో డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు పూర్తయినప్పటికీ ఎవరికి ఇవ్వకుండా కుక్కలు, పందులు సంసారం చేస్తున్నాయని చెప్పారు. పేదలు ఇల్లు కిరాయిలు.. పిల్లల ఫీజులు కట్టలేక బతకలేని పరిస్థితిలో జీవనం గడుపుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికీ ఎంక్వయిరీ చేసుకొని పోయి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి ఇండ్లు ఇవ్వలేదన్నారు. వెంటనే వనస్థలిపురంలో, నందనవనంలో ఉన్న ఇండ్లను గుర్తించి ఇల్లు లేని పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, పింఛన్ల సమస్య విపరీతంగా ఉన్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తమ్ చేశారు.లేనియెడల ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని గుర్తించి రాబోయే రోజుల్లో భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ కమిటీ సభ్యులు పోట్టేపాక రామస్వామి, కాశయ్య, రాధమ్మ, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సర్కిల్ సభ్యులు ఎం.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పేదలకు కేటాయించాలని కోరుతూ ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

సైదాబాద్, మార్చి 26:ఆరు గ్యారంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ అన్నారు. బుధవారం మాదన్నపేట ఉప్పరి బస్తీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్ని గ్యారెంటీ పేరుతో వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. నగరంలో రైల్లో ఒక మహిళపై లైంగిక దాడి యత్నం, పట్టపగలు న్యాయవాదిని దారుణంగా హత్య చేయడం వంటి సంఘటనలు అనేకం ప్రతి రోజూ చోటు చేసుకుంటున్నాయన్నారు. పాత నగరంలో మజ్లిస్ పార్టీ అభివృద్ధిని పట్టించుకోవడంలేదని, దీంతో పేదరికంతో పాతబస్తీ వాసులు దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న గుర్తించడం లేదన్నారు. నాలుగు నియోజకవర్గాల్లో 20 కార్పొరేటర్ సీట్లను గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. మజ్లిస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుందని, ప్రజలను మతం పేరుతో విడగొట్టి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. ముస్లింలు సైతం నరేంద్ర మోదీని బలపరుస్తున్నారని ఆయన చేసే అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు పలుకుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, యాకత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గ్ వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహేశ్, యుగంధర్, ప్రమోద్, నవీన్, ఓరుగంటి అరవింద్ గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

సైదాబాద్, మార్చి 26 :ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సంతోష్‌నగర్‌లోని లక్ష్మీ డయాగ్నోస్టిక్ అండ్ స్పెషాలిటీ ల్యాబ్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది.ఈ సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. సంతోశ్‌నగర్‌లో లక్ష్మీ డయాగ్నోస్టిక్ అండ్ స్పెషాలిటీ ల్యాబ్ కొనసాగుతుంది. కాగా, బుధవారం సాయంత్రం డయాగ్నోస్టిక్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో వెంటనే అప్రమత్తమైన నిర్వాహకులు మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. వారు సమయానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో దాదాపు రూ.40లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మీర్‌పేటలో ఇంటి పన్నులు తగ్గించండి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కృషి వల్లే

ఓటీఎస్: బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట, మార్చి 26: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు సిద్దాల లార్డ్స్ బీరప్ప, ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి రాజకుమార్, ఉయ్యాల నవీన్ గౌడ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో ఇటీవల పెంచిన అధిక శాతం ఇంటి పన్నులను తగ్గించాలన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ తీసుకురావడంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారంటూ.. ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పనులు తగ్గించాలంటూ.. కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ఇద్దరు చోరీ నిందితుల రిమాండ్

సైదాబాద్, మార్చి 26: హైదరాబాద్, రాచకొండ జంట కమిషనరేట్ల పరిధిలో ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సొత్తును స్వాధీనపర్చుకొని రిమాండ్‌కు తరలించారు. వివరాలు సైదాబాద్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ వెల్లడించారు. సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్, సైదాబాద్ క్రైమ్ పార్టీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 145 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడుసెల్ ఫోన్లను, ద్విచక్ర వాహనం స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో లోకాయుక్త కాలనీలో రెండురోజుల కిందట ఓ ఇంట్లో దొంగతనం చేసి 20 తులాల బంగారం, సెల్‌ఫోన్లను తస్కరించిన సంఘటనలో ప్రేమేయం ఉన్న షాహిన్ నగర్‌కు చెందిన హాబీబ్ మహమూద్ అలియాస్ చోటు పాత నేరస్తుడు. అతడి సోదరుడు హబీబ్ అలీ ఈ నేరంలో సంబంధం ఉన్నట్లు గుర్తించి వారి కదిలికలపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నారు. వీరికి ఫలక్‌నామా,షాహినాత్ గంజ్, మొఘల్‌పుర, ఐఎస్ సదన్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన పలు అనేక దొంగతనాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో వారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపించారు. 2024 జూలై లో మొగల్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో దొంగతనం చేయడంతో వారి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 2025 ఫిబ్రవరిలో బెయిల్‌పై జైలు నుంచి విడుదలై మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోకాయుక్త కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన దొంగతనం కేసులో ప్రమేయం ఉండటంతో వారిని పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. నిందితుల నుంచి స్వాధీన పర్చుకున్న సొత్తు విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. సైదాబాద్ డీఐ ఆనంద్, ఎస్ ఐలు తదితరులు పాల్గొన్నారు.

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపిస్తున్న పోలీసులు

యువకుడు ఆత్మహత్య

సైదాబాద్, మార్చి 26:కుటుంబ కలహాలకు ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం సైదాబాద్ సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. బాధితుల, పోలీసుల కథనం ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమావత్ శివ(28) సింగరేణి కాలనీ బాంబే కాలనీలో నివాసముంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి కల్లు తాగి వచ్చి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లుకు బానిస కావడం వల్లే కొంతకాలంగా కుటుంబకలహాలు నడుస్తున్నాయి. దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు స్థానికులు, పోలీసులు తెలియజేశారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీన పరుచుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సెక్టార్ ఎస్ఐ సాయికృష్ణ దర్యాప్తు జరుపుతున్నారు.

రామావత్ శివ(ఫైల్)

ప్రభుత్వ బడుల్లో వెలుగులు

కందుకూరు, మార్చి 26: ప్రభుత్వ బడుల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కందుకూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీధిదీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో రాత్రివేళల్లో ఆట పాటలను ఆడుకోవడానికి ప్రభుత్వం వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాపరెడ్డి, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ సొడపు వెంకటేశ్ గౌడ్, మాజీ అధ్యక్షుడు ఢిల్లీ (శ్రీధర్ ముదిరాజ్, డైరెక్టర్ ప్రశాంత్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, జగన్, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్, వరుణ్ రెడ్డి, ఖాజా మొయినుద్దీన్, ప్రతాపరెడ్డి, కృష్ణా, నరసింహ, శ్రీశైలం, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల పాఠశాలలో హైమాస్ట్ లైట్లు

మండల కేంద్రంలోని ప్రభుత్వ కస్తూర్బా పాఠశాలలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి తీసుకెళ్లడంతో వారు వెంటనే రూ.4లక్షలతో రెండు ఐమాస్ట్ లైట్లు మంజూరు చేశారు. దీంతో లైట్ల ఫిటింగ్‌కు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్, గ్రామశాఖ పార్టీ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బొక్క నరేందర్‌రెడ్డి, కుమ్మరి కృష్ణయ్య, సొడపు శేఖర్‌గౌడ్, బొక్క దామోదర్‌రెడ్డి, సొడపు శంకర్ గౌడ్, బొక్క దేవేందర్ రెడ్డి, మహ్మద్ ఖదీర్, బొక్క హనుమంతు రెడ్డి, బొక్క రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ భార్గవి, ఉపాధ్యాయులు అర్చన మంజుల, రమాదేవి, ప్రమోదా వీమల, విజయలక్ష్మి, అమృత, స్రవంతి పాల్గొన్నారు.

– కందుకూరు, మార్చి 26

విత్తన పండుగను విజయవంతం చేయాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న రజినీకాంత్, యాదగిరి

కందుకూరు, మార్చి 26:తెలంగాణ తొలి విత్తన పండుగను విజయవంతం చేయాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ప్రతినిధి రజినీకాంత్ కోరారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో జిల్లా పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో జరిగే దేశీ విత్తనాల ప్రదర్శనలో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరించిపోతున్న దేశీ విత్తనాల సంరక్షణ కోసం సంస్థ నడుం బిగించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు వివరించారు. వివిధ రాష్ట్రాల విత్తనాల ప్రదర్శన కూడా ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో పాల్గొనడానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రావడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంద యాదగిరి, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభా సమావేశాలు వీక్షించిన మహిళా న్యాయ కళాశాల విద్యార్థులు

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా న్యాయ కళాశాల విద్యార్థులు బుధవారం శాసనసభ సమావేశాలను వీక్షించారు. సభ నడిపే తీరును వారు తిలకించారు. విద్యార్థులు కృత్తిక, ప్రవచన, కోమల్ పాతుగా పలువురు పాల్గొన్నారు. – ఎల్బీనగర్, మార్చి 26

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

హస్తినాపురంలోని అనయ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగమేళాకు విశేష స్పందన లభించింది. బుధవారం నగరంలోని 5 ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. విద్యార్థుల అకడమిక్, అర్హతలను పరిశీలించారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యా సంస్థ నుంచి 33 మంది ఎంపికైనట్లు తెలిపారు. డిగ్రీ పూర్తవుతున్న సందర్భంలోనే ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– వనస్థలిపురం, మార్చి 26

వేసవిలో యాక్షన్ ప్లాన్

సమావేశంలో మాట్లాడుతున్న డీఈ వెంకన్న, వినీల్ గౌడ్

బడంగ్‌పేట్, మార్చి 26: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వర్క్ ఇన్స్పెక్టర్లకు డీఈ వెంకన్న, ఏఈ వినిల్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వర్క్ ఇన్స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బడంగ్‌పేట మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య ఏ డివిజన్లో ఏ విధంగా ఉందో వర్క్ ఇన్స్పెక్టర్ల నడిగి తెలుసుకున్నారు. వాటర్ లీకేజీలు అయితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌వండబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కారమయ్యే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్లు అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాచారం లేకుండా ఎక్కడ పనులు చేయకూడదన్నారు. పెండింగ్ పనుల జాబితాపై సమీక్షించారు. పని విషయంలో వర్క్ ఇన్స్పెక్టర్లు జాప్యం చేయకుండా చూసుకోవాలన్నారు. సమస్యలు ఏమున్నా మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. డ్రైనేజీలపై ఫైన్ల, విషయంలో, రోడ్ల విషయంలో సమాచారం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు వర్క్ ఇన్స్పెక్టర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్లు రాకేష్, వినయ్, శేశి రెడ్డి, ఉదయ్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సైదాబాద్, మార్చి 26: చంపాపేట ప్రధాన రహదారి దగ్గర అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి(40)ని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై శివశంకర్ తెలిపిన ప్రకారం.. సోమవారం రాత్రి చంపాపేటలోని ఓ షోరూం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అపరస్మారక స్థితిలో పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి అతన్ని చికిత్స నిమిత్తం